

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 21 పుష్పం :26,29 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-2-99, చించినాడ)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈ సృష్టిని సృజించే వాడిని బ్రహ్మ అని, ఈ సృష్టి కార్యాన్ని నిర్వర్తించే వాడిని విష్ణువు అని ఈ సృష్టిని లయం చేసేవాడు శివుడు అని మనం ఈ ముగ్గురిని ఆరాధిస్తాము.భగవంతుడు ఒక్కడే. ఉన్న వస్తువు ఒక్కటే. బ్రహ్మద్వారా, విష్ణువు ద్వారా, శివుడు ద్వారా చేసేది భగవంతుడే అని మనం గుర్తించాలి. భగవంతుడు అంతటా ఉన్నాడు. మన అందరి హృదయాలలో ప్రవేశించి ఉన్నాడు. రమణమహర్షి గారిని మీరు ఎవరు అంటే నేను నేనే అని చెప్పేవారు. నేను అంటే ఆత్మ అది నేనే అని చెప్పటం. నేను అంటే మనం దేహగతమైన నేను అనుకొంటున్నాము. జ్ఞానికి దేహగతమైన నేను నశిస్తుంది, ఆత్మగతమైన నేను ఉదయిస్తుంది. నేను నేనే అంటే అర్థం ఏమిటి అంటే ఆత్మే నేను, బ్రహ్మమేనేను అని అర్థం. ఎవరు ఏపని చేస్తున్నారో ఆ పని మీద ప్రేమ, భక్తి లేకపోతే వారు తరించరు. మనం చేసిందే మనకు ఎదురు వస్తుంది.

స్వార్థపరులకంటే స్వార్థంలేని వారికి ఈ లోకం ఎంతో అందంగా కనిపిస్తుంది అని వివేకానంద చెప్పారు. బాగా స్వార్థపరులకు ఈలోకం అంత అందంగా కనబడదు, స్వార్థం లేనివారికి చాలా అందంగా కనబడుతుంది. ఆ సౌందర్యమును చూసే దృష్టి లేనప్పుడు సౌందర్యం కూడా కనబడదు. స్వార్థం లేని వారికి ఈ లోకం సౌందర్యంగా కనబడటానికి కారణం ఏమిటి అంటే ఈ ప్రపంచం ఉంది కాబట్టి అందులో మనం ఉన్నాము కాబట్టి ఇతరులకు సహాయం చేయగలుగుతున్నాము. ప్రపంచం లేకపోతే ఇతరులకు సహాయం చేయలేము. ఇతరులకు సహాయం చేయుటం వలన కదా మనం బాగుపడేది. లోకం ఉండటం వలన ఇతరులకు సహాయం చేస్తున్నాము గాని లోకం లేకపోతే ఎవరికి సహాయం చేస్తాము అని స్వార్థంలేని వాడు అనుకొంటాడు. అందువలన వాడికి ఈలోకం ఎంతో సుందరంగా కనిపిస్తుంది. స్వార్థపరులకు వారి తిండి, బట్ట తప్పించి, వారి పేరు తప్పించి ఇంకో గొడవ ఏమి ఉండదు. ఇలా దేహంచుట్టు తిరుగుతూ ఉంటారు. వారికోసమే వారు పూజలు చేసుకొంటారు. సామాజిక స్పృహ ఉండదు. ఈశ్వరుని మీద ప్రేమ ఉండదు, మోక్ష కాంక్ష ఉండదు. కష్టం కష్టం అనుకొంటే మోక్షం ఎలా వస్తుంది. కష్టం కష్టం అనుకొంటే ఆ పని మీద ప్రేమ లేదు అని అర్థం. ఎవరు ఏ పని చేస్తున్నారో ఆ పని మీద ప్రేమ ఉండాలి. చేసే పని భక్తి పూర్వకంగా, ప్రేమ పూర్వకంగా చేయాలి.

ఈ నామాన్ని స్మరిస్తేనే మోక్షం వస్తుంది, ఈ రూపాన్ని ఆరాధించుకొంటేనే మోక్షం వస్తుంది అని చెప్పేవారికి తత్వం తెలియదు అని అర్థం. అసలు వస్తువుకు నామం లేదు, రూపం లేదు. ఎవరు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నారో ఆ మార్గంలో వారు ప్రేమగా, ప్రీతిగా ప్రయాణం

చేస్తూ ఉంటే వారిని ఆ మార్గంలో ప్రోత్సాహం చేసి సత్యవస్తువును పొందేటట్లు చేయాలి గాని ఉన్నదానిని చెడగొట్టకూడదు. మీరు ఏదో ఒక రూపాన్ని, నామాన్ని ఆరాధించుకోవచ్చు. మీరు ఆరాధించేది ఒక్కటే నిజం. మిగిలినది నిజం కాదు అనుకోవటం గుడ్డివారు ఏనుగు కథ లాంటిది. ఒక గుడ్డివాడు ఏనుగు చెవి పట్టుకొని ఏనుగు అంటే ఎలాగో ఉంటుంది అనుకొన్నాను చేటలాగ ఉంది అన్నాడట. ఇంకో గుడ్డివాడు ఏనుగు కాలు పట్టుకొని ఏనుగు అంటే ఎలాగో ఉంటుంది అనుకొన్నాను స్తంబంలాగ ఉంది అన్నాడట. వారు ఏనుగు గురించి ఎలా అనుకొంటున్నారో తత్వం తెలియనప్పుడు మన పరిస్థితి కూడా అంతే, భగవంతుడి గురించి అలాగే అనుకొంటాము. భగవంతుడు శక్తి గురించి మనకు తెలియటం లేదు. ఇన్ని కోట్లాది జీవులు ఉన్నాయి. ఎవరిని ఎక్కడకలపాలో, ఎవరికి ఏ అనుభవం కలుగ జేయాలో ఇది అంతా చేసేది భగవంతుడే. ఆయన శక్తిని మనం ఎక్కడ ఊహించగలము. వేదాంత పుస్తకాలు చదివి మోక్షం వస్తుంది అని తొందరపడి అనుకోవద్దు. మనకు సంసాంసుఖం తెలుస్తోంది గాని మోక్షసుఖం తెలియటం లేదు. ఈ సంసార సుఖం నుండి బయటపడి మోక్షసుఖం పొందాలి అనే కాంక్ష తనంతట తానుగా హృదయంలో నుండి ఎవరికైతే వస్తుందో, మోక్షం కోసం చేసే ప్రయత్నం కష్టం అనుకోకుండా ఎవడైతే ప్రేమగా, ప్రీతిగా చేస్తున్నాడో వాడు మోక్షాన్ని పొందుతాడు. నిష్కామకర్మ, నిష్కామభక్తి వలన మోక్షం వస్తుంది. భగవంతుని ఆజ్ఞను ఎవరైతే అనుసరిస్తున్నారో, భగవంతుడు చెప్పిన మాటను అర్ధంచేసుకొని, గౌరవించి, ఆచరిస్తున్నారో వారికి మోక్షం వస్తుంది.

వివేకానంద ఒక మీటింగులో మాట్లాడుతూ మీకు అందరికీ నేను ఎందుకు మంచి చేయాలి. నాబాగు నేనే చూసుకోవచ్చు కదా మీకు అందరికి ఎందుకు మంచి చేయాలి, మంచిమాటలు చెప్పాలి అని అడిగాడు. అలా ఎందుకు చేస్తున్నాను అంటే మీకు చేసే మంచి, మీకు చేసే ఉపకారం భగవంతుడు తిరిగి నాకే ఇస్తాడు అని తెలుసు కాబట్టి చేస్తున్నాను అని చెప్పాడు. నీవు సన్యాసివా, గృహస్థుడివా అనేది ముఖ్యంకాదు. నీవు సన్యాసివి అయినా, గృహస్తుడివి అయినా మోక్షం పొందకుండా అడ్డు వచ్చేది దేహాభిమానమే. నీకు మోక్షం పొందటానికి ఏది అడ్డువస్తోందో దానిని తొలగించుకో. నీ మాట ద్వారా, చేత ద్వారా, ఆలోచన ద్వారా దేహాభిమానాన్ని తగ్గించుకొంటూ వస్తే నీవు సన్యాసిగా ఉన్నా , గృహస్తుడుగా ఉన్నా మోక్షాన్ని పొందుతావు. నీవు గృహస్థాశ్రమం లోనుండి బ్రహ్మచర్యాశ్రమంలోనికి, బ్రహ్మచర్యాశ్రమంలోనుండి సన్యాసాశ్రమం లోనికి ఇలా తలంపులను మార్చుకొంటున్నావు గాని తలంపులను విడిచి పెట్టటానికి ప్రయత్నం చేయటం లేదు. పరిసరాలు మార్చుకోవటం, తలంపులను మార్చుకోవటం ముఖ్యంకాదు. తలంపులనుండి విడుదలపొందటం ముఖ్యం. ఎందుచేతనంటే తలంపే నిన్ను బందిస్తోంది. తలంపు లేకపోతే ఏది లేదు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-3-99, చించినాడ)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా!**

మౌనమే నిజమైన ఉపదేశం. మౌనం అంటే ఎక్కడయితే మనస్సు అణిగిందో అక్కడ మౌనస్థితి కలుగుతుంది. కొంతమందికి మెదడులో కొన్ని కోణాలు వికశించి ఉంటాయి. కొన్ని కోణాలు చీకటిగా ఉంటాయి. అలా కాకుండా అన్ని కోణాలు వికశించి ఉంటే వాడిని పూర్ణమానవుడు అంటారు. మెదడులోని అన్ని కోణాలు వికశించి ఉంటే వాడి మనస్సు